# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 96 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

10-02-2026 మంగళవారం వెల : 1/- పేజీలు : 4


# మహిళా రేషన్ డీలర్‌పై అధికారుల వేధింపులు???



- ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్న అధికారులు
- కూటమి నాయకుల ఒత్తిడితోనే ఈ చర్యలా?
- అధికారులపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన మహిళా డీలర్

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి ప్రాంతంలో చౌక ధర దుకాణం నిర్వహిస్తున్న మహిళా రేషన్ డీలర్ కొండ్రి విజయలక్ష్మిపై సంబంధిత అధికారులు అన్యాయంగా నోటీసులు జారీ చేసి మానసికంగా వేధిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఎటువంటి అవకతవకలు లేకపోయినా, "జస్ట్ ఎంక్వయిరీ మాత్రమే" అంటూ వచ్చి తరువాత మాట మార్చి నోటీసులు ఇవ్వడం అధికారుల ద్వంద్వ వైఖరిని బయటపెడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరసవిల్లి డిపో పరిధిలో రేషన్ షాప్ నిర్వహిస్తున్న కొండ్రి విజయలక్ష్మి గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ నిబంధనల ప్రకారం ఎలాంటి ఫిర్యాదులు లేకుండా, నిజాయితీగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల శ్రీకాకుళం నుంచి వచ్చిన సీ.స్ డీటీ అనిల్ కుమార్ , రెవెన్యూ ఆర్ఐ జాన్సీ ఆమె దుకాణానికి వచ్చి "జస్ట్ ఎంక్వయిరీ" పేరుతో పరిశీలన నిర్వహించారు.పరిశీలన సమయంలో ఎటువంటి అవకతవకలు లేవని అధికారులే స్పష్టంగా చెప్పినప్పటికీ, "మీ పనితీరు బాగుంది" అంటూ చుట్టుపక్కల లబ్ధిదారుల సంతకాలు తీసుకురావాలని సూచించారు. వారి మాటలను నమ్మి విజయలక్ష్మి లబ్ధిదారుల సంతకాలు సేకరించి సమర్పించినా, రెండు రోజుల తరువాత మాట మార్చి డోర్ నెంబర్ తప్పుగా నడుపుతున్నారంటూ నోటీసులు జారీ చేయడంతో తీవ్ర వివాదాస్పదంగా మారింది.ఇక మహిళా డీలర్‌తో అధికారులు అసభ్యంగా, బెదిరించే ధోరణిలో మాట్లాడారని ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. "ముందు కూడా నోటీసులు వచ్చాయి" అంటూ బెదిరించినట్లు మాట్లాడడం తన మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని విజయలక్ష్మి వాపోయారు. ఈ వ్యవహారం తో తాను మానసికంగా, ఆర్థికంగా నష్టపోయానని తెలిపారు.

ఈ అన్యాయంపై ఎదురు తిరిగిన విజయలక్ష్మి, ఈరోజు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు.. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, నిజాయితీగా పని చేస్తున్న తన పై కొంతమంది అధికారులు అధికార జులుం చూపుతూ వారి హోదాను దుర్వినియోగం చేస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. జారీ చేసిన అన్యాయ నోటీసులను వెంటనే రద్దు చేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు.ఈ మొత్తం వ్యవహారం వెనుక కూటమి ప్రభుత్వ నాయకుల ఒత్తిడి ఉందా? లేక కొంతమంది అధికారులు ఎప్పుడూ ఇలాంటి ద్వంద్వ వైఖరితోనే వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా పనిచేసే మహిళా డీలర్లకు రక్షణ కల్పించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని లబ్ధిదారులు, ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# పీకె ఎంటర్టైన్మెంట్స్ 4వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోకతోట సింహాచలం






**నవతరం -శ్రీకాకుళం**

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం పీకె ఎంటర్టైన్మెంట్స్ 4వ వార్షికోత్సవ వేడుకలలో భాగముగా సిక్కోలు లఘు చిత్రోత్సవ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. సిక్కోలు కళలకు పుట్టినిల్లని, సినీరంగంలో సిక్కోలు మార్కును చూపించేలా యువత ఎదగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి నాయకులు, abbs నేషనల్ కన్వీనర్, శ్రీ పోకతోట సింహాచలం గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోకతోట సింహాచలం గారు మాట్లాడుతూ యువతను ప్రతిభను ప్రోత్సహించేలా పీకె ఎంటర్టైన్మెంట్స్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని, యువత చెడు వ్యసనాలదారిన పడకుండా తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశంలోనే కళింగాంధ్రకు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉందని, కానీ నేడు శ్రీకాకుళానికి గానీ కళింగాంధ్రకు గానీ ఆ పేరు ప్రఖ్యాతలు కరువైందని తెలిపారు. సినీరంగంలో శ్రీకాకుళం యువతకు ఎటువంటి ఆదరణ గౌరవం లభించడం లేదని, ఎక్కువ డబ్బులు పెట్టి సినిమా తీసి పెద్ద సినిమా అంటున్నారని, చిన్న సినిమా అయినా పెద్ద సినిమా అయినా చూపించే జీవితం అదేనని తెలిపారు. కదా సాహిత్యం విషయంలో పాత విధానాలను విడిచిపెట్టి కొత్త తరానికి చేరువయ్యేలా సినిమాలు రూపొందించాలని యువతకు సూచించారు. అశ్లీలత లేని సినిమాలు నిర్మించి యువతకు మంచి సందేశాత్మకమైన షార్ట్ ఫిలిం అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అనంతరం పలు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు.పీకె ఎంటర్టైన్మెంట్స్ వ్యవస్థాపకులు సతివాడ.ప్రసాద్, రామకోటి కీర్తి, నారా హర్షవర్ధన్ ఇతర సభ్యుల బృందం కు శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రచయిత అట్టాడ. అప్పలనాయుడు, సినీ దర్శకుడు మోహన్ శ్రీవత్స, పుక్కల్ల రాజేంద్ర, గాయత్రీ కళాశాల అధినేత సంయుక్త, నగర ప్రముఖులు, లయన్స్, రోటరీ, జేసీఐ అధ్యక్ష బృందం, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలి

## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం -శ్రీకాకుళం**

ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను నిర్ణీత కాలపరిమితిలో సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. పరిపాలనలో పారదర్శకత, వేగం పెంచడం ద్వారానే ప్రజా సంక్షేమం నెరవేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ పార్క్ సహా ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వంద రోజుల్లోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించుకుంటూ పనులు వేగవంతం -మిగతా 4లో

# సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


2లో

# శ్రీకాకుళంలో రాయి వేణుగోపాల్ సన్మానం


2లో

ఎడిటోరియల్

# అది రాజ్యాంగ విరుద్ధమే!

సామాజిక ఆలోచనాపరుల తాత్విక చింతనలు ఎంతలా ఒకేలా ఉంటాయి?! "కులముగలవాడు, గోత్రంబుగలవాడు విద్యచేత విర్రవీగువాడు పసిడిగలవాని కొడుకులు" 17-18 శతాబ్దాల మధ్య వేమన "వైద్యులనూ, ప్లీడర్లనూ, పురోహితులనూ, కవుల్నీ, శాస్త్రజ్ఞుల్నీ అందర్నీ తనకు (పెట్టుబడికి) ఊడిగం చేసే కూలీలుగా మార్చేసింది". 19వ శతాబ్దం మధ్య కమ్యూనిస్టు మేనిఫెస్టోలో మార్క్స్, ఏంగెల్స్. విధానం సంక్షోభంలో పడేసరికి రాక్షసం విరుచుకుబడ్తోంది! మరో అతి పెద్ద దేశవ్యాపిత సమ్మెకు కార్మికులు సిద్ధమవుతున్న సందర్భంలో సీజేఐ గారి నోట్లోంచి జాలువారిన సదరు "ఆణిముత్యాలు" దురదృష్టకరమే కాదు, రాజ్యాంగ విరుద్ధం కూడా! ఆ వ్యాఖ్యానానికి మద్దతుగా కొన్ని అంకెలు, సంఖ్యలు చెప్పి ఉంటే బాగుండేది! ఏమైనా ఆయన "బాధ్యత" ఆయన నిర్వర్తించారు!
ఇక్కడొక చిక్కొచ్చి పడింది. నాలుగు 'కోడ్సూ' నోటిపై చేసేముందు మోడీ సాబ్ చెప్పింది నమ్మాలా? పెద్ద కోర్టు పెద్ద జడ్జీ గారు చెప్పింది నమ్మాలా? ఊగిసలాడే కార్మికుల మెదళ్లు ఇప్పుడు తేటపడ్డాయి. గంభీర ప్రవచనాల వెనక రాజకీయ జుమ్లాలున్నాయని అర్థం చేసుకుని ఫిబ్రవరి 12 సమ్మెకు నడుం బిగిస్తున్నారు. 'అందరికి అన్నీ' అన్న రాజకీయుల మాటల మూటలను సీజేఐ గారి గుండుపిన్ను 'టప్పు' మని పేల్చి, 'ఎవరికి ఏమీ' లేదని తేల్చింది. తమిళనాట ఇంటిపనివారల సంఘం (పెన్ తోజిలార్గళ్) తమని షెడ్యూల్‌లో చేర్చి సంక్షేమ చర్యలు అమలు చేయాలని సుప్రీం తలుపు తడితే (ఇప్పటికే తెలంగాణలో ఆ సౌకర్యం పేపర్ మీద ఉందని ఆయనకు తెలుసో తెలీదో) లేదు పొండనీ, దేశ ప్రగతి ఆగిపోడానికి కారణం కార్మిక సంఘాలేనంటూ విరుచుకుబడ్డారు.
దేశంలో విఫలమైంది ఉదారవాద ఆర్థిక విధానాలు సార్! ఆ గాజుకొంపలో కూచుని కార్మికోద్యమంపై ఎవరూ రాళ్ళు విసరలేరు. దేశంలో పారిశ్రామిక వివాదాలే తగ్గిపోతున్నాయనే విషయం ఏ అధికారైనా పాపం! న్యాయ వ్యవస్థకెపుడైనా చెప్పేదుస్తేగా! 2006లో సాలుకు 430 పారిశ్రామిక వివాదాలుంటే, 2015-23లో (అంటే మోడీ శకంలో) నాటకీయంగా 75కి తగ్గాయి. 2023లో దేశవ్యాప్తంగా 30 మాత్రమే! ఇక ట్రేడ్ యూనియన్లు దేనికి బాధ్యత వహించాలి? పారిశ్రామికోత్పత్తి తగ్గుదలకు వాటికేం బాధ్యతుంది? సైద్ధాంతిక పునాదిగాని అనుభవ పూర్వక వివరాలుగానీ (ఎంపెరికల్ ఎవిడెన్స్) లేకుండా మాట్లాడితే ఎలా? ఇవి వాస్తవాలను తిరగేసి చూడటం కదా?!
పైగా పార్లమెంటులో కార్పొరేట్ మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానంలో 2,04,268 ప్రయివేటు పరిశ్రమలు ఒకదాన్లో ఒకటి కలిసిపోవడం (అమాల్గమే షన్), మార్పిడి (కన్వర్షన్), విలీనం (డిసాల్వ్) కావడం జరిగింది. కార్మిక సంఘాలు కారణమని చెప్పలేదు. అంత పెద్ద జడ్జిగారికి ఇంత చిన్న లెక్కలు తెలియదనుకోలేం! అదనంగా ఇన్సాల్వెన్సీ అండ్ బాంక్రప్టీ బోర్డు ఆఫ్ ఇండియా (ఐబిబిఐ) ఏమి లెక్క తేల్చిందంటే కార్పొరేట్ వైఫల్యాలకు ప్రధాన కారణం అప్పులు చెల్లించలేకపోవడం, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ లేకపోవడం, విదేశీ పోటీ తట్టుకోలేకపోవడం వంటి ఇతర ఎన్నో కారణాలను పేర్కొంది. 1998-2000 సంవత్సరం నుండి ఇలాంటి కారణాలను ప్రభుత్వ సంస్థలే పేర్కొంటున్నా అవే విధానాలను కార్పొరేట్ల కోసమే నాటి పీవీ నుండి నేటి మోడీ వరకు ఆబగా అమలుచేస్తున్నారు.
ప్రభుత్వరంగ పరిశ్రమలు మంచి ప్రధాన ఉపాధి కేంద్రాలు. వాటిని భ్రష్టు పట్టించారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక ఎంఎస్ఎంఈలు (మీడియమ్ స్మాల్ మైక్రో పరిశ్రమలు) 11 కోట్ల 30 లక్షలు మంది ఇక్కడే ఉపాధి పొందుతున్నారు. బహుళజాతి కంపెనీల పీక్కుతినే తత్వానికి వీటిని బలిచేస్తున్నారు. మన దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ రంగం మోన్‌శాంటో, కార్గిల్, బేయర్ వంటి ఎంఎన్‌సిల ఆకలికి బలౌతున్నది. 2014 నుండి మోడీ వేసే గోశాయి చిట్కాలకు ఉపాధి పెరుగుతుందా? ఆర్థిక వ్యవస్థలోని ఈ అంశాలను పట్టించుకో కుండా కార్మిక సంఘాలను తప్పుపడితే ఉపయోగమేమిటి?
మరో కీలకాంశం ఆర్టికల్ 19(1)(సి) సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితపడే హక్కు భారత రాజ్యాంగమే ఇచ్చింది. ఇది సీజేఐకి తెలియదని అనుకోలేం. ఆర్థిక విధానాలను, కార్మిక హక్కులను ఒకదానికొకటి సంబంధంలేనివిగా న్యాయ వ్యవస్థ పరిగణించడం మరో దౌర్భాగ్యం. దీన్నే కొందరు విమర్శకులు 'మార్కెట్ సిద్ధాంతం, ఆర్థిక ఇంగిత జ్ఞానం (ఎకనామిక్ కామన్‌సెన్స్)తో న్యాయ వ్యవస్థ నిండిపోతోంద"ం టున్నారు. 'సులభతర వ్యాపారం' కోసం పాలకులు తలుపులు బార్లా తెరుస్తూంటే అది అన్యాయమని 'న్యాయం' అనకపోవ డం నిజంగా అన్యాయమే. జనవరి 31 పత్రికల్లో వార్త చూస్తే రూ.35,962 కోట్లు విదేశీ సంస్థాగత పెట్టుబడులు "మునిగిపోయే పడవలో నుండి" బయటికి దూకినట్లు దూకేశాయి. అవిగవిగో పెట్టుబడులు.. ఇవిగివిగో ఉద్యోగాలం టూ సీఎమ్మేలు, పీఎమ్మేలు ఎంత ఊదరగొట్టినా ఖాళీ సంచీలే మిగులుతున్నాయి. వచ్చే పెట్టుబడులూ లేవు, ఉపాధి అంతకన్నా లేదు.
కార్మికులకు సంబంధించినంత వరకూ ఫిబ్రవరి 12 చావో రేవో తేల్చుకోవాల్సిన దేశవ్యాపిత సమ్మె. ఆషాడభూతులెందరు అడ్డుపడ్డా కార్మికులారా! ఆగేబఢో!!

# "టెన్త్" విద్యార్థులను చదివించండి ఇలా..!



పదో తరగతి పరీక్షల కు సంబంధించి ఎప్పుడు ఏ పరీక్ష అనే విషయాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. టెన్త్ సదువుతున్న పిల్లలను వారిని ఉదయం 5 గంటలకు నిద్ర లేపండి. లేవగానే..పుస్తకం పట్టుకో అని కాకుండా, ముందు "కళ్ళ ను నీళ్లతో తుడుచు కో" అని చెప్పండి. పిల్లల ను నిద్ర లేపిమళ్లీ మనం పడుకునే బదులు
వాళ్లను motivate చేయడం కోసం తల్లి దండ్రుల్లో ఎవరో ఒకరు ఈ కొన్ని రోజుల పాటు పదో తరగతి సదువుతున్న పిల్లల పేరెంట్స్ (ఎవరో ఒకరు) వేకువ జామున నిద్ర ను తరిమి కొట్టాల్సిందే. మనం మెలకువగా ఉండి, పిల్లల్ని "చదువు" అంటే మంచిది. ఒక వేళ పిల్లలు నిద్ర ఆపుకోలేక కూరుకు పాట్లు పాడితే వారిని దయచేసి తిట్టకండి గిట్టితే?! ఇగ నువ్వు పాసయినట్టే.. "ఓ..నిద్ర". "ఇగ నువు పాస్ కావు"ఫెయిల్ ఐతవు ఇలా మాట్లాడకండి.
నిద్ర కళ్ళు ఉంటే?!లేచి నించుని మళ్ళీ చదవమని చెప్పడం బెటర్ ఇక కొన్ని రోజుల పాటు ఇంటర్నెట్ టీవీ బంద్ చేస్తే.. మరింత ఉత్తమ ఫలితాలు ఖాయం. వీలైతే..ఇంట్లో పాలు ఉంటే?! కాఫీ లేదా టీ పెట్టి ఇస్తే మంచిది. అంతే తప్ప..అరచి గాయ్..గాయి చేసి కటువుగా,కర్కశంగా తిడితే?; పొద్దున పొద్దున్నే బ్లాంక్ పేపర్ లా ఉండే మైండ్‌లో ప్రోత్సాహం/ప్రేరణ బదులు సదవకపోతే తిట్టే తిట్లే మైండ్ లో దిగి పోతాయి కాబట్టి ఓపిక తో.. ప్రోత్సాహం ఇవ్వండి. ఉత్సాహం నింపండి. మన వాళ్ళు స్టేట్ టాప్ ర్యాంక్ కొట్టాలి.
ఓ అద్భుత అస్త్రం ను మనం తయారు చేస్తున్న భావన తో నే ఉండాలి. మీ బాబు/పాప టెన్త్ అదరగొట్టాడు కదా కంగ్రాట్స్ అని బంధు మిత్రులు,వాళ్ళు వీళ్ళు ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పాలి. మేడం,సార్ మీ అబ్బాయి/అమ్మాయి ఫోటో కావాలి అంటూ మీడియా మీ వెంట పడాలి. సార్/మేడం మీ అబ్బాయికి/అమ్మాయికి ఫ్రీ సీట్ ఇస్తాం మా కాలేజీ లో చేర్చురా అంటూ ప్రాధేయపడాలి.ఇదంతా..తపన, శ్రద్ధ, తో నే సాధ్యం. ఏ మాత్రం అశ్రద్ధ ఉన్నా..ఈ కొన్ని రోజుల పాటు తరిమి కొట్టండి.

మాచన రఘునందన్
పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్
డిప్యూటీ తాశీల్దార్
వ్యక్తిత్వ వికాస నిపుణులు
9441252121

## సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

నవతరం -శ్రీకాకుళం

అంతర్జాల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న 'సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం' పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అవగాహన ప్రచార పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి ఇంటర్నెట్ కోసం అనే థీమ్‌తో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఐఓ కిరణ్ కుమార్, ఏడీఐఓ విజయ బాబు, ఎల్డీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో రాయి వేణుగోపాల్ సన్మానం

నవతరం -శ్రీకాకుళం
ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అంబేద్కర్ వాది రాయి వేణుగోపాల్‌ను సోమవారం శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జీఓ హోంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘాలతో పాటు దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ నాయకులు, వ్యాపార, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని అభినందనలు తెలిపారు. జిల్లా నాయకులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, చౌదరి పురుషోత్తంనాయుడు తదితరులు వేణుగోపాల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాయి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం సాగిస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులను కూడా చిరుసత్కారం చేశారు. వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జాబ్ క్యాలెండర్ పై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలి...

- నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలి..
- ఏఐవైఎఫ్ డిమాండ్




నవతరం-శ్రీకాకుళం

ఫిబ్రవరి 12వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో జాబ్ క్యాలెండర్ పై ప్రకటన చేయాలని, నిరుద్యోగుల సమస్య పరిష్కారం కు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఆఫీసు నందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే భర్తీ చేస్తామని చెప్పి, ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్న నిరుద్యోగ భృతి ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో పనిచేసిన ఏపీ బేవరేజెస్ కార్మికులు, రేషన్ డిపో వాహనాలలో పనిచేసిన కార్మికులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి ఉద్యోగాలను తీసివేసి రోడ్డు మీద పడేసిందని తక్షణమే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని నెలకు పదివేల రూపాయలు బృత కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకులు వాలంటీర్ వ్యవస్థను తీసివేసిందని వెంటనే వాలంటీర్ వ్యవస్థ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే ప్రకారంగా ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి నిర్వహించకపోవడం వలన డీఎస్సీ అభ్యర్థులకు వయసు పెరిగిందని వారికి వయోపరిమితి 49 సంవత్సరాలకు పెంచాలని, టెట్ మరల నిర్వహించి టెట్ అభ్యర్థులను ఆదుకోవాలని కోరారు. కనీసం ఈ అసెంబ్లీ సమావేశాలలోనైనా నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న మంత్రులు, కలెక్టర్ కార్యాలయం ముట్టడించి నిరుద్యోగులకు అండగా ఏఐవైఎఫ్ ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ వై వేణు, ఏఐవైఎఫ్ నాయకులు వసంతరావు, అన్నాజీ, శ్రీ నిధి, ఉపేంద్ర, రామోజీ, రామమూర్తి, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# చట్టానికి వ్యతిరేకంగా వార్తలు రాయరాదు

## సిఆర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్

నవతరం -శ్రీకాకుళం

చట్టానికి వ్యతిరేకంగా వార్తలు రాయరాదని సిఆర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్ వెల్లడించారు.
సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోంపేటలోని విబిఆర్ ఫంక్షన్ హాల్ లో రెండో రోజు జిల్లా గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతులను మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ సిఆర్ అకాడమీ తరపున నిర్వహిస్తున్న పునశ్చరణ శిక్షణ తరగతులను గ్రామీణ పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారత చట్టాలకు వ్యతిరేకంగా వార్తలు ప్రజెంటేషన్ చేయరాదని స్పష్టం చేశారు. మన రాత వలన మన ప్రక్కన ఉన్న వారికి ఇబ్బంది ఉండకూడదని తెలిపారు. మనం రాసే వార్త సరి చూసుకోవాలని చెప్పారు. చట్టాలు, పత్రికా స్వేచ్ఛల గూర్చి తెలుసుకోవాలన్నారు. రెండు రోజుల పునశ్చరణ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని మరింత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.
అనంతరం పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందచేస్తారు.




ఈ సమావేశంలో ప్రజాశక్తి దిన పత్రిక సంపాదకులు తులసీదాస్,సీనియర్ జర్నలిస్ట్ డి. సోమసుందర్ సీనియర్ పాత్రికేయులు బెందాళం కృష్ణారావు ,సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు,, సిఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి వి. మణిరాం, సీనియర్ పాత్రికేయులు బొడ్డుపల్లి రాజగోపాలరావు, గ్రామీణ పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్నకు తలపాగా, వస్త్రాలు












మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా శ్రీశైలంలో కొలువై ఉన్న భ్రమరాంబ, మల్లికార్జునులకు జిల్లాలోని పలువురు చేనేత కార్మికులు భక్తి శ్రద్ధలతో నేసిన తలపాగా వస్త్రాలను సమర్పించనున్నారు.నాలుగు వారాల పాటు ఎన్నో నియమ నిష్టలను పాటించి,శ్రమించి వస్త్రాలను అపురూపంగా తీర్చిదిద్దారు. ఈ వస్త్రాలను నేస్తున్న రోజుల్లో శివపార్వతుల పటానికి నిత్య పూజలు నిర్వహించారు.

## సమర్పించినున్న వస్త్రాలివే

మల్లికార్జునస్వామికి 366 మూరలు(160 సె.మీ) పొడవు,48 సె.మీ వెడల్పు గల తలపాగా 40వ కౌంటు నూలుతో వేస్తారు.భ్రమరాంబకు 6మీ.పసుపు అంచు చీర,శెనగల బసవన్నకు ఆరు మీ. ఎరుపు పంచె, అలాగే వినాయకునికి 3మీ ఎరుపు పంచెనేశారు. వీటన్నిటిని కలిపి చుట్టి శివలింగం రూపంలో తీర్చిదిద్దారు.దీన్ని రూపొందించేందుకు మూడు నుంచి నాలుగు వారాలు పట్టింది.

## వస్త్రాలు రూపొంచింది వీరే

తూతిక శంకరరావు (ఫౌజుల్ బేకింగ్ పేట),కాశిన శంకరరావు(లావేరు),బల్ల భద్రయ్య,దండా హర్షవర్ధన్(పొందూరు),మురకల ధర్మారావు, కాకర్ల కృష్ణ (తండ్యాంమెట్ట శ్రీరాంనగర్ కాలనీ) తదితర చేనేత కార్మికులు తలపాగా వస్త్రాలను రూపొందించిన వారిలో ఉన్నారు.వీరిలో ఒకరిద్దరు కార్మికులు చేనేత కార్మిక రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న మురకల వెంకటరావు(పొందూరు)సంపూర్ణ సహకారాన్ని తీసుకున్నారు.ఈ నేత పని జయప్రదంగా పూర్తయింది.ఈ వస్త్రాలన్నింటిని కలిపి శివలింగం రూపంలో తీర్చిదిద్దారు.దీనిపై ఓం నమశ్శివాయ అనే అక్షరాలను ఆకర్షణీయమైన రీతిలో రాశారు.

త్వరలోనే సంబంధిత
చేనేత కార్మికుల స్వగ్రామాల్లో తలపాగాకు వందలాది భక్తులతో తిరువీధిని ఇప్పటికే నిర్వహించారు.మంగళ వాయిద్యాల నడుమ భక్తులు,మహిళలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఓం నమశ్శివాయ అంటూ నామ స్మరణ చేసారు.కర్పూర నీరాజనాలతో స్వాగతించారు. కార్మికులు ఈ తలపాగాను శ్రీశైలం తీసుకుని వెళ్లి మహాశివరాత్రి రోజున లింగోద్భవ శుభ సమయంలో శ్రీశైల శిఖరానికి చుడతారు. మరో విశేష మేమిటంటే ఇక్కడికి సమీపంలోని మందరాడలో(విజయనగరం జిల్లా)ముత్తిక వీర్రాజు దంపతులు రోజుకొక మూర వంతున మొత్తం 365 రోజుల పాటు తలపాగా వస్త్రాలను నేశారు.

## చేనేత కార్మికుల విజ్ఞాపన

ఈ తలపాగాను రూపొందించిన తమకు శ్రీశైలం దేవస్థానం తగు నగదు పారితోషికం,ప్రయాణ భత్యాన్ని కల్పించి ప్రోత్సాహించాలని కార్మికులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

## "ప్రత్యేక దర్శనానికి చర్యలు తీసుకుంటున్నాం"

తలపాగాను భక్తిప్రపత్తులతో రూపొందించిన చేనేత కార్మికులకు వారి అభ్యర్థన మేరకు శ్రీశైలంలో ప్రత్యేక దర్శనం కోసం జిల్లా కలెక్టర్ ఇప్పటికే అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సంబంధిత అధికారులకు తగు చర్యల కోసం సిఫార్సు చేశారు.ఇక శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారికి ప్రత్యేకంగా లేఖ రాస్తున్నాం. ఈ మేరకు దేవస్థానం అధికారులు తగు విధంగా స్పందించగలరని ఆశిస్తున్నాం.

**టి.జనార్ధనరావు, సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ, శ్రీకాకుళం**

**writer విశ్లేషణ: వాండ్రంగి కొండలరావు,నామ విజ్ఞాన వేత్త, సెల్ 9490 528730**

# ఎస్సీ దండాసి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక..



**నవతరం -మందస**

జిల్లా ఎస్సీ దండాసి కుల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారంమండలం లోని పిడిమందస శ్రీ యోగ నంద ఆశ్రమం వద్ద జిల్లా ఎస్సీ దండాసి కులసమవేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు సామంతు జీవన్, ఉపాధ్యక్షుడు సామంతు రామారావు,కార్యదర్శి కొండల కామేశ్వరరావు,ఉప కార్యదర్శి బమ్మిడి పుణ్యవతి, క్యాషియర్ లుగా శ్యామల నరేష్ (నాని) ఇప్పిలి ధర్మారావు, జిల్లా సంఘ లీగల్ అధ్యక్షుడు బల్ల బలరాంలను జిల్లా నూతన కార్యవర్గం గాఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ. దండాసి కుల ఐక్యత తో హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ముందుకు వెళ్తామన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తామన్నారు. పేదలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.జిల్లా నలుమూలలనుంచి దండాసి కులస్తులు పాల్గొన్నారు. అనంతరం పంక్తి భోజనం నిర్వహించారు.



# లావణ్యకు కోపమొచ్చింది

మెగా కోడలు లావణ్య కొణెదల త్రిపాఠికి కోపం వచ్చింది. రామ్ చరణ్ కు కవలలు పుట్టిన సందర్భంగా ఓ తమిళ జర్నలిస్టు వేసిన ట్వీట్ పై లావణ్య భగ్గుమంది. ఇంతకీ ఏం జరిగిందంటే, రామ్ చరణ్ కు కవలలు జన్మించినప్పుడు చిరంజీవి రియాక్ట్ అయ్యారు. తనకు ఓ మనవడు, ఓ మనవరాలు పుట్టినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అదే టైమ్ లో ఓ తమిళ జర్నలిస్టు, కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. మొదటి సారి చరణ్ కు క్లింకార (ఆడ పిల్ల) పుట్టినప్పుడు ఇంత సంబరం లేదని, ఇప్పుడు మగ బిడ్డ పుట్టేసరికి చాలా ఆనందపడుతున్నారంటూ ట్వీట్ చేశాడు. దీనిపై లావణ్య త్రిపాఠి భగ్గుమంది. "నేను సాధారణంగా ఇలాంటి ట్వీట్‌లు పట్టించుకోను. కానీ ఈ ట్వీట్ చాలా పేలవంగా ఉంది, నిజంగా సంతోషకరమైన క్షణాన్ని ఇబ్బందికరంగా మార్చేశావు. చిరంజీవి తన కుటుంబంలోని మహిళలతో, ముఖ్యంగా మనవరాళ్లతో ఎలా ఉంటారో మీకు తెలియదు. ఆడపిల్లలకు ఆయనిచ్చే గౌరవం, చూపించే ప్రేమలో కనీసం 1 శాతం కూడా బయట వ్యక్తులు చేయలేరేమో." ఇలా చిరంజీవిని పొగుడుతూనే, తెలియని విషయాలపై స్పందించకుండా ఉంటే మంచిదంటూ చురకలంటించింది. లావణ్య పోస్ట్ తో సదరు వ్యక్తి తన పోస్ట్ ను డిలీట్ చేశాడు. వరుణ్ తేజ్-లావణ్య దంపతులకు గతేడాది కొడుకు పుట్టిన సంగతి తెలిసిందే. కొడుక్కి వాయువ్ తేజ్ అని పేరుపెట్టారు.

# వారణాసి ఓటీటీ లెక్కలు వేరే!



ఒక సినిమాకు ఓటీటీ హక్కులు అంటే ఏముంటాయి. ఒక లాంగ్వేజ్ లో, లేదా నాలుగు లాంగ్వేజ్ ల హక్కులు.. కాదంటే ఇండియా వైడ్ గా, ఇంకా చెప్పాలంటే వరల్డ్ వైడ్ గా. కానీ వారణాసి సినిమా లెక్క అలా కాదు అని తెలుస్తోంది.
వారణాసి ఓటీటీ డీల్ చర్చలు ప్రస్తుతం జరుగుతున్నాయి. వరల్డ్ వైడ్ గా సినిమా స్ట్రీమింగ్ హక్కులు మాత్రమే ఓటీటీకి ఇవ్వడం లేదు. సినిమా కంటెంట్ ఏదైనా కూడా నెట్ ఫ్లిక్స్ కే ఇచ్చేలా డిస్కషన్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.
అంటే సినిమా ఈవెంట్ల హక్కులు కూడా నెట్ ఫ్లిక్స్ కే ఇస్తారన్నమాట. ఇన్ని ఈవెంట్లు చేస్తాం.. ఫలానా ఫలానా చోట్ల చేస్తామని ముందే చెబుతారు. అలాగే ఈ ఏడాది ఆగస్ట్ కు కాస్త అటు ఇటుగా రియల్ టీజర్ ఫంక్షన్ వుంటుంది.
ఇంతకు ముందు వదిలిన టీజర్ కాన్సెప్ట్ టీజర్. ఇప్పుడు షూటింగ్ ఫుటేజ్ లోంచి తీసిన కంటెంట్ టీజర్ వుంటుంది. దానికోసం ఫంక్షన్ చేస్తారు.
అలాగే ఓవర్ సీస్ లో రెండు ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారు. వాటి బ్రాడ్ కాస్టింగ్ హక్కులు కూడా నెట్ ఫ్లిక్స్ కే ఇచ్చేటట్లు.. ఇలా అన్ని విధాలుగా మాగ్జిమమ్ ఓటీటీ హక్కుల రూపంలో రాబట్టాలనే ప్లాన్ లు జరుగుతున్నాయి. ఇదిలా వుంటే వారణాసి మూవీ షూట్ వర్క్ నుంచి అగస్ట్ నాటికి హీరో మహేష్ బాబు రిలీవ్ అయిపోతారు. ఆ తరువాత నుంచి వరుసగా ఇక సినిమా పబ్లిసిటీ వ్యవహారాలు వుంటాయి

# శ్రీకాంత్‌కు వరించిన గంగాధర్ ప్రధాన్ అవార్డు

**- ప్రతిష్టాత్మకమైన గంగాధర్ ప్రధాన్ పురస్కారం అందజేసిన పదామృత నృత్యాయన నాట్య సంస్థ - పలువురి అభినందనలు**

**నవతరం-శ్రీకాకుళం**



భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ కూచిపూడి నృత్య గొప్పతనాన్ని భావితరాలకు చాటి చెప్పేందుకు విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ కూచిపూడి గురువు శివశ్రీ నృత్య కళానికేతన్ అధినేత డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ కు పద్మశ్రీ గురు గంగాధర్ ప్రధాన్ స్మారక అవార్డు వరించింది. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన పదామృత నృత్యాయన నాట్య సంస్థ వారు ప్రతి సంవత్సరం కళా రంగంలో విశేష కృషి చేసిన వివిధ ప్రముఖ గురువులకు పద్మశ్రీ గురు గంగాధర్ ప్రధాన్ స్మారక పురస్కారాన్ని బహుకరిస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూచిపూడి నాట్య రంగంలో విశేష ప్రతిభ చూపిస్తున్న అదే విధంగా విశేష కృషి చేస్తున్న మన శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి గురువు శివశ్రీ నృత్య కళానికేతన్ అధినేత డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ ను పద్మశ్రీ గురు గంగాధర్ ప్రధాన్ స్మారక పురస్కారంతో పాటు పదివేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించి గౌరవించారు.

ఈ పురస్కారాన్ని పదామృత నృత్యాయన సంస్థ నిర్వాహకులు అయినా బిందుప్రియ, ప్రీతి ప్రీతి ప్రియ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, ఎస్పీ జ్యోతింద్ర పండా ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ తన 15 మంది శిష్య బృందంతో కూచిపూడి నాట్య అంశాలను ప్రదర్శించి ఆహుతులను అలరించారు.

శ్రీకాంత్ కు ఈ ప్రతిష్టాత్మకమైన పురస్కారం లభించినందుకుగాను జిల్లా ప్రజాప్రతినిధులు, పలు కళాకారులు, వివిధ కళా సంస్థలు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని, మరింత ఉన్నతంగా ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.

# నరుడి పతనం...???

1... మంచిని మరిచి
నరుడే ఈనాడు
నయ వంచకుడైనాడు
వంచన నేర్చి
నరుడే ఈనాడు
వానర జాతికి వారసుడైనాడు

నిన్న తేనెను పంచిన తేనెటీగ
నేడు విషాన్ని చిమ్మే విషసర్పం

చంద్రలోకమును జయించే
మేధాశక్తితో మిడిసిపడుతూ
రెక్కలు తెగిన పక్షిలా
నేడు నేల రాలుతున్నాడు

గాలానికి చిక్కిన చేపలా
విలవిలలాడుతున్నాడు
ధనమే పెరిగి గుణమే తరిగి
మరుగుజ్జులా మారిపోతున్నాడు

ఎండమావిలో నీటికోసం పరితపిస్తూ
జింకలా పరుగులు పెడుతున్నాడు
మానవత్వాన్ని మరచి వంచన నేర్చి
పాతాళంలోకి పడిపోతున్నాడు

భక్తి ముసుగేసి బాబానంటూ
గుడిని గుడిలోని లింగాన్ని
బకాసురుడిలా మింగేస్తున్నాడు
కంచు కంఠంతో కాకిలా
మోసపు పాటలు పాడుతున్నాడు

2... కడుపు నిండిన పాములా
గాలిని భోంచేస్తున్నాడు
బలహీనుల కన్నీటిధారలపై
సామ్రాజ్యాలు నిర్మిస్తున్నాడు

తీరని ధనదాహంతో పేదలను
పాతాళానికి తొక్కేస్తున్నాడు
ఆరిపోయే దీపం ముందు
మిడతలా ఎగిరెగిరిపడుతున్నాడు

కోట్లకోట్ల ఆస్తులు ఆర్జించి
ధనానికి దాసుడౌతున్నాడు
బంధాలబోనులో బందీయైనా
సింహంలా గర్జిస్తున్నాడు

దుర్వ్యసనాల ఊబిలోకి జారి
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరౌతున్నాడు
సుడిగుండంలో చిక్కిన
పడవలా మునిగిపోతున్నాడు

నమ్మకం గాజుపాత్రలా పగిలి
నరకాన్ని రుచి చూస్తున్నాడు
గొంతులు కోసే పదునైన
కత్తిలా మారిపోతున్నాడు

3... జనాల రక్తాన్ని జలగలా
జుర్రుకుంటున్నాడు
తాను కూర్చున్న కొమ్మను
తానే నరుక్కుంటున్నాడు

మంటల్లో ఆహుతయ్యే కట్టెలా
తనను తానే కాల్చుకుంటున్నాడు
తనకంటిని తానే పొడుచుకుంటున్నాడు
విధాతనే ఎదిరిస్తూ....విర్రవీగుతున్నాడు

తనలో తానే నవ్వుకుంటున్నాడు
తనసమాధిని తానే తవ్వుకుంటున్నాడు.
నరుడే ఈనాడు నయవంచకుడైనాడు
తన పతనానికి తానే కారకుడయ్యాడు.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

- అన్ని రంగాల్లోనూ బీసీలకు 44% రిజర్వేషన్ అమలు చేయాలి
- రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యి ఎకరాల కేటాయించాలి
- జనగణనలో సమగ్ర కుల గణన జరగాలి
- 22న బీసీ సింహ గర్జన విజయవంతం చేయాలి
- బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ





**నవతరం-శ్రీకాకుళం**

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22న బీసీ సింహ గర్జన కార్యక్రమం చేపడుతున్నామని రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు కాయితి వెంకటరమణ తెలిపారు. నగరంలోని పెద్దపాడు లో ఉన్న ఓ భవనంలో ఆదివారం బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐక్యత, ఆత్మగౌరవం, అధికారం నినాదంతో బీసీ సింహగర్జన చేపడుతున్నామని ఈ సభను విజయవంతం చేస్తూ బీసీలంతా పాల్గొనాలని వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ బీసీలకు 44 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాలు, బీసీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా జన గణనలో సమగ్ర కులగనన జరగాలని తెలిపారు. బీసీ బిడ్డల బతుకులు దిద్దేలా.. భవిత మారేలా.. భరోసా ఇచ్చేలా.. నవసకానికి నాంది పలుకుతూ నవ శంఖం పూరించిన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ అడుగుజాడల్లో అడుగేస్తూ ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ బోరుభద్ర చంద్రకళ, శ్రీకాకుళం జిల్లా కన్వీనర్, జిల్లా అధ్యక్షులు పానిలి ప్రసాద్, ఇచ్చాపురం నియోజకవర్గ కన్వీనర్ బడ్డీ మురళి, ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్ బొడ్డ కృష్ణారావు, జిల్లా కార్యవర్గం కలగ ఢిల్లీశ్వరరావు, నియోజకవర్గం కార్యవర్గం పానిలి వేణుగోపాల్, పల్లి అప్పలసూరి, పానిలి అప్పారావు, వంకల చిన్నప్ప, కలగ సూర్యనారాయణ, కాగిత అప్పన్న, బలగ సాయి, కలగ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

# విద్యుత్ వినియోగంపై 'స్మార్ట్' అవగాహన

**నవతరం-శ్రీకాకుళం**

విద్యుత్ వినియోగదారులకు అత్యాధునిక సాంకేతిక సేవలు, ప్రీ-పెయిడ్ మీటర్ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 'స్మార్ట్ మీటర్స్ పఖ్వాడా' పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 వరకు సాగే ఈ కార్యక్రమాల ద్వారా వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల విశిష్టతను వివరించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ మీటర్ల వినియోగదారులు తమ అవసరానికి తగినట్లుగా ముందస్తు చెల్లింపులు చేసుకోవచ్చని, మొబైల్ యాప్ ద్వారా నిరంతరం విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మానవ తప్పిదాలకు తావులేకుండా ఖచ్చితమైన బిల్లింగ్, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు రావడం ఈ మీటర్ల ప్రధాన ప్రయోజనాలన్నారు. పక్షోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, మొబైల్ యాప్ ఇన్‌స్టాలేషన్ కేంద్రాలు, మీటర్ల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వివరించారు. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకోవడానికి, పారదర్శక సేవలు పొందేందుకు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో మీటర్ల అమరికకు వచ్చే విద్యుత్ సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని, సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**

చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పూర్తయిన పనుల బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఆర్థిక పురోగతిలో జిల్లాను ముందు వరుసలో నిలబెట్టాలని కోరారు. జిల్లా ఆదాయ వనరులపై దృష్టి సారించిన కలెక్టర్, రంగాల వారీగా జీడీపీ వృద్ధిని సమీక్షించారు. ఏ రంగాల్లో వెనుకబాటు ఉందో గుర్తించి, వృద్ధిని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా గ్రామస్థాయి నుంచి పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై రాజీ పడకూడదని, వసతి గృహాల్లో సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులపై అధికారుల ఒత్తిడి సరికాదు



**నవతరం-శ్రీకాకుళం**

- సాగర్ ఘోష పోస్టర్ ఆవిష్కరణ
- ఎపిసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఎపిసిపిఎస్ఈఏ జిల్లా అధ్యక్షులు చల్ల సింహాచలం అధ్యకతన జిల్లా కార్యవర్గ సమావేశంతోపాటూ సాగర్ ఘోష పోస్టర్ ఆవిష్కరణ స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి.రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతున్నా సీపీఎస్ ఉద్యోగులు ఊసే లేదని, ఏడాదిలోగ పరిస్కారమార్గం చూపిస్తామని మరచిపోయారన్నారు.. ఎపిసిపిఎస్ఈఏ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా అనేక పోరాటాలు చేస్తున్నా, పట్టించుకునే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. సెప్టెంబర్ 1 బ్లాక్ షర్ట్స్ తో విజయవాడలో భారీ నిరసన తెలియజేశామని, 2018 నుండి సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయలకోసం హైకోర్టు లో కేసువేసి న్యాయ పోరాటం చేస్తున్నామని.. 26 జిల్లాల్లో సుమారు 2500 కిలోమీటర్లు సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర చేసి 26 జిల్లా కలెక్టర్లకు సీపీఎస్ ఉద్యోగుల సమస్యపై వినతి పత్రాలు ఇచ్చామని...ఆ పోరాట ఫలితమే డిఎ బకాయిలు, ఆరు విడతలు ఉద్యోగులకు ప్రభుత్వం వేసిందని తెలియజేసారు. ఎపిసిపిఎస్ఈఏ ప్రధాన డిమాండ్లలో సీపీఎస్ రద్దు చేయాలనీ, డిఎ బకాయిలు తక్షణమే మొత్తం చెల్లించాలని, అక్రమ కేసులు ఎత్తి వేయాలని, సచివాలయ ఉద్యోగులపై అధికారుల ఒత్తిడి సరికాదని.. అందుకు నిరసనగా మార్చి 1 తేదీన సీపీఎస్ ఉద్యోగుల సాగర ఘోష పేరుతో విశాఖపట్నం ఆర్టీసీ బస్టాండ్, గాంధీ విగ్రహం దగ్గర భారీనిరసన చేస్తామని తెలియజేసారు.

ఈ కార్యక్రమం లో ఎపిసిపిఎస్ఈఏ జిల్లాప్రధాన కార్యదర్శి అంపోలు షణ్ముఖ రావు,రాష్ట్ర కౌన్సిలర్ పి.సూర్య చంద్ర, ఆర్థిక కార్యదర్శి యాళ్ల సుందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ బొడ్డు శేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు పైడి. మహేశ్వరరావు, శరత్ బాబు కెఎల్.నారాయణ, లోలుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**